# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-12-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర అభివృద్ధికి కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు**

2. **దేశవ్యాప్తంగా ఈ రోజు జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

3. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాజీ ప్రధాని వాజ్‌పేయి 100వ జయంతి కార్యక్రమంలో రేపు పాల్గొంటారు.**

4. **వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోజు వైయస్సార్ జిల్లాలో పర్యటిస్తున్నారు.**

5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక ఈ నెల 29వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది.**

==========================

రాష్ట్ర అభివృద్ధికి కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.రాజధాని అమరావతి ప్రాంతంలోని తుళ్లూరు గ్రామాల్లో నిర్మించిన సీడ్ యాక్సెస్ రహదారులను కేంద్ర మంత్రి ఈరోజు పరిశీలించారు. గొల్లపూడి వరకు నిర్మించిన బైపాస్ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ ( 28 సెకన్లు)

--------------------------

వినియోగదారుల చట్టంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని విశాఖపట్నం జిల్లా వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ జి.తనూజ రెడ్డి తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆమె ఆకాశవాణితో మాట్లాడుతూ, ఆహార పదార్థాల్లో కల్తీ, కొనుగోలు చేసిన వస్తువులో నాణ్యత లేకపోవడం వంటి అంశాలపై వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.వినియోగదారుల కమిషన్ కొనుగోలదారుల హక్కులు సంరక్షించడంతో పాటు ఉచిత న్యాయ సేవలు అందిస్తుందని తెలియజేస్తూ,

వాయిస్ (28 సెకన్లు)

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సాయంత్రం ఢిల్లీకి వెళ్లనున్నారు. దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి 100వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన రేపు పాల్గొంటారు. అనంతరం పలువురు కేంద్ర మంత్రులతోనూ సమావేశమై, రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

ప్రముఖ చలన చిత్ర దర్శకులు శ్యాం బెనెగల్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తో సహా పలువురు చలనచిత్ర రంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. భారతీయ సినిమాకు అంతర్జాతీయ ఖ్యాతి నార్జించి పెట్టిన గొప్ప దర్శకులు శ్యాం బెనెగల్ అని ప్రముఖులు తమ సంతాప సందేశంలో పేర్కొన్నారు. 90 సంవత్సరాల వయస్సు గల శ్యాం బెనెగల్ వృద్ధాప్య సమస్యలతో నిన్న ముంబయిలో కన్ను మూశారు.

భూదాన్ పోచంపల్లి చేనేత కార్మికుల జీవితాలను, తెలంగాణా పల్లె వాతావరణాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన శ్యాం బెనెగల్ 1934 వ సంవత్సరం డిసెంబర్ 14 వ తేదీన హైదరాబాదులో జన్మించారు. భారతీయ చలన చిత్ర రంగానికి శ్యాం బెనెగల్ అందజేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ, పద్మ భూషణ్ పురస్కారాలతో సత్కరించింది. భారతీయ సినీ రంగంలో అత్యున్నత పురస్కారమైన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు కూడా ఆయనఅందుకున్నారు.

---------------------------

ఇంటర్మీడియట్ పరీక్షలకు రుసుము చెల్లించేందుకు ఈ రొజు నుంచి 31వ తేదీ వరకు తత్కాల్ పథకం కింద తుది అవకాశం కల్పించినట్లు ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి కృతికాశుక్లా తెలిపారు. గతంలో ఫీజు చెల్లించలేకపోయిన వారు అపరాధ రుసుముతో కలిపి ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు విడివిడిగా 3 వేల రూపాయల చొప్పున చెల్లించాలని సూచించారు. ఇకపై పరీక్ష రుసుము గడువు పొడిగింపు ఉండదని స్పష్టంచేసారు.

---------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోజు వైయస్సార్ జిల్లాలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా జిల్లాలోని ఇడుపులపాయలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్‌వద్ద నివాళులర్పించారు. అనంతరం ప్రేయర్ హాల్‌లో జరిగన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం కడప నియోజకవర్గం పార్టీ నాయకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో భవానీ దీక్ష విరమణ కార్యక్రమం నాల్గవ రోజుకు చేరుకున్నాయి. భవానీ దీక్షాధారులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తులు హెూమగుండం వద్ద నేతి కొబ్బరికాయలు సమర్పిస్తున్నారు. దేవస్థానం అధికారులు, జిల్లా యంత్రాంగం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని క్యూ లైన్లలో ఉచిత దర్శనం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మిశ ఆకాశవాణితో మాట్లాడుతూ,

వాయిస్ (29 సెకన్లు)

కాగా రేపటితో  దీక్షల విరమణలు ముగుస్తాయి.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

దక్షిణ మధ్య రైల్వే  విజయవాడ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వి.రాంబాబు 'అతి విశిష్ట రైలు సేవా పురస్కార్' అవార్డు అందుకున్నారు. ఢిల్లీలో  జరిగిన కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్  పురస్కారాన్ని ప్రదానం చేశారు. గత రెండేళ్లలో విజయవాడ డివిజన్ కు 5వేల కోట్ల రూపాయల ఆదాయం తెచ్చినందుకు ఆయన ఈ అవార్డుకు ఎంపికైయ్యారు.ఈ సందర్భంగా  రాంబాబు మాట్లాడుతూ,

వాయిస్ (25 సెకన్లు)

---------------------------

షెడ్యూల్ కులాలు- ఎస్సీ వర్గీకరణపై విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్రతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ఈ నెల 27 నుంచి 30 వ తేదీ వరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పర్యటించనుంది. ఎస్సీ వర్గీకరణపై సమావేశాలు నిర్వహించి ప్రజలు, సంఘాలు, సంస్థల నుంచి అభిప్రాయాలు, వినతులు స్వీకరిస్తుందని అధికారులు తెలిపారు. వినతులు సమర్పించలేని వారు విజయవాడ మొగల్రాజపురంలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమిషన్ కార్యాలయానికి వ్యక్తిగతంగా హాజరై వినతులు సమర్పించవచ్చని కమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది.

---------------------------

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అనంతపురం శాసనసభ్యులు  డి. వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. అనంతపురం నగరంలో ఆయన ఈ రోజు  పర్యటించి  ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర ప్రసాద్ పాత్రికేయలతో  మాట్లాడుతూ "మీ ఇంటి వద్దకే మీ ఎమ్మెల్యే" కార్యక్రమంలో భాగంగా నగరంలోని ప్రతి డివిజన్ ను సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.  అనంతపురం నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు.

---------------------------

ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత వాహనాలను వినియోగించాలని పార్వతీపురం మన్యం జిల్లా సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు.  ఫిట్ ఇండియా సైక్లింగ్ ట్యూజ్ డే కార్యక్రమంలో భాగంగా ఈ రోజు పార్వతీపురంలో ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీని ఆయన  ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్  మాట్లాడుతూ.. సైకిళ్ల వినియోగంపై అవగాహన, ప్రాముఖ్యతను తెలిపేందుకు ఈ ర్యాలీని నిర్వహించినట్లు  చెప్పారు. వాయు కాలుష్యం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో  ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఇంధన పొదుపుతో పాటు, ఆరోగ్యమైన జీవన శైలికి  ఫిట్ ఇండియా కార్యక్రమం దోహదం చేస్తుందని తెలిపారు.

---------------------------

దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చేందుకు 100 రోజుల క్షయ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ నెల 7 నుంచి మార్చి 16వ తేదీ వరకు నిర్వహించే ఈ వంద రోజుల ప్రచారంలో అనేక కార్యక్రమాలను చేపడుతోంది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 347 జిల్లాల్లో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

======================